# స్మశానం దున్నేరు

డా.కేశవరెడ్డి



# స్మశానం దున్నేరు

*డా॥ కేశవరెడ్డి*

హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర : రూ. 80/-
మొదటి ముద్రణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1979
HBT మొదటి ముద్రణ : ఆగష్టు, 2011
ముఖచిత్రం : కాళ్ళ
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్,
గుడిమల్కాపూర్,
హైదరాబాద్ - 500 067
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ,
126 శాంతినగర్, హైదరాబాద్-28
ఫోన్: 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# వైరుధ్యాల చిత్రణ ప్రధానం

దాదాపు మూడు దశాబ్దాల కిందట డా. కేశవరెడ్డి రాసిన నవల 'స్మశానం దున్నేరు'. రచయితగా ఆయన తొలిరోజుల్లో రాసిన నవల ఇది. ఒక పాఠకునిగా ఈ నవల చదివాక కలిగిన అభిప్రాయాల్ని చెప్పదలిచాను. కేశవరెడ్డి రాసిన ఈ నవలని చదవడం ఇదే తొలిసారి. ఆయన రాసిన వాటిలో మొదట నేను 'సిటీ బ్యూటీఫుల్'ని సీరియల్‌గా వచ్చే రోజుల్లో చదివాను. నవీన్ 'అంపశయ్య' తర్వాత యూనివర్సిటీ జీవితం మీద వచ్చిన నవలల్లో నాకు బాగా నచ్చిన నవల అది. డా. కేశవరెడ్డి పేరు ఆవిధంగా నాకు పరిచయమైంది. ఆ తర్వాత దిగ్భ్రమగొలిపే శైలీవిన్యాసంతో రాసిన 'అతడు అడవిని జయించాడు' ఏకబిగిన చదివాను. దరిమిలా కేశవరెడ్డి అభిమానినయ్యాను. తర్వాతి రోజుల్లో మూగవాని పిల్లనగ్రోవి, చివరిగుడిసె చదివాను, ఇటీవలి కాలంలో మునెమ్మ. ఒక రచయిత రాసిన క్లాసిక్స్ అనదగ్గ నవలలు చదివాక అదే రచయిత తొలిరోజుల్లో రాసిన నవల చదివితే ఎలా వుంటుంది. నవల చదవడానికి ఉపక్రమించినప్పుడు ఇలాంటి ఆలోచనలేవీ రాలేదు. కానీ ఇప్పుడు ఒకసారి అవలోకిస్తే ఒక వైవిధ్యభరితమైన ఫీలింగ్.

'స్మశానం దున్నేరు' నవలపై ముందస్తు అభిప్రాయాలేవీ లేవు. నవల గురించి అక్కడక్కడ విన్నదీ, చదివిందీ ఏదీ మనసులో పెట్టుకోకుండా ఓ రాత్రి చదవడానికి ఉపక్రమించా. ఎప్పటి మాదిరిగానే ఆసాంతం ఆగకుండా చదివాను. చదివాను అనడం



కన్నా చదివింపజేసిందనడం సబబు. బలవంతంగా ఒక పుస్తకం అందునా ఓ నవల చదవడం సాధ్యం కాదు. చదివే మూడ్ ఉండటంతో పాటు చదవడం ఆరంభించిన వెంటనే ఒక కుతూహలం రేకెత్తాలి. ఏదో చెప్పబోతున్నాడనిపించాలి. ఉత్సుకతతో ముందుకు సాగాలి. ఆవిధంగానే ఈ నవలలోకి నడిస్తే ఒకనాటి హరిజన వాడలోని వారి దుర్భరమైన హరిజనుల జీవితం దర్శనమిస్తుంది. వారిలోని అంతర్గత వైరుధ్యాలు ఎంత తీవ్రమైనవో తెలుస్తాయి. అగ్రకులాల వారి పెత్తందారీతనం, దౌర్జన్యం కింద అణగారి పోతూకూడా నోరు మెదపని వారి బతుకు తీరులోని దైన్యం కళ్ళకు కడుతుంది. తన ప్రయోజనాలకు అడ్డువస్తే నమ్మినబంట్లను కూడా జైలు పాల్జేసే భూస్వామి పోకడలు అవగతమవుతాయి.

ఈ నవల అచ్చురూపంలో వచ్చింది 1979లో అయినప్పటికీ ఇందులోని జీవితం 1970లకు పూర్వపు కాలంనాటిది. ఇది రాయలసీమ ప్రాంతానికి చెందినది. ఇందులో అగ్రహారం, హరిజనవాడల ప్రస్తావన ద్వారా ఇతివృత్తానికి గల కేంద్రస్థానాన్ని రచయిత సూచించారు. అతి భయానకమైన, హేయమైన భూస్వామ్య దోపిడికీ, పీడనకీ తెలిసీ తెలియకనే బి.సి. కులాలకు చెందినవారు తోడ్పడిన వైనం మరో గమనించదగ్గ అంశం. ఈ నవలలో పెదరెడ్డికి తొత్తుగా వున్న వెంకటాద్రిగానీ, హరిజనులకు కల్లు పోసేందుకు వచ్చిన ఈడిగవాడు గానీ హరిజనుల్ని అవమానకరంగా, హీనంగా చూడటాన్ని గమనిస్తే నిచ్చెనమెట్ల సమాజంలోని కుట్రని రచయిత చెబుతున్నాడనిపిస్తుంది.

హరిజనుల మీద పెత్తనం చెలాయించినంత మాత్రాన, వారి మీద చీటికిమాటికి నోరు పారేసుకున్నంత మాత్రాన తాము

పెత్తందారులయిపోరు. పెత్తందారులకు తొత్తులుగానే మిగిలిపోతారు. తమ ప్రయోజనాలు దెబ్బతినే పరిస్థితి వస్తే తొత్తుల్ని కూడా వెంటాడి వేధిస్తారు అదే పెత్తందారులు. ఈ నవల్లోని పెదరెడ్డి ఆ కోవకు చెందిన మనిషే. కనుకనే ఏళ్ళ తరబడి తనకు సేవ చేసిన, తన తరపున సకలపనులు చేసిపెడుతూ వున్న వెంకటాద్రిని సైతం జైలు పాల్జేస్తాడు పెదరెడ్డి. భూస్వామ్య పెత్తందారీతనం ఎంతటి భయానకమైనదో, అమానవీయమైనదో ఈ నవల ద్వారా ప్రతీకాత్మకంగా చెబుతారు రచయిత.

బి.సి. కులాల సహకారం తీసుకుంటూనే హరిజనుల్ని అణచివేసే భూస్వామ్యపు అహంకారం, స్వార్థం, కుటిల వ్యూహంలోని ఎత్తుగడలు అర్థమవుతాయి ఈ నవల చదివితే. పెదరెడ్డి, తన చేతికి మట్టి అంటకుండానే హరిజనుల మీదకు బి.సి.లని ఉసిగొల్పడం, తన పెత్తనాన్ని ప్రశ్నించిన రంపాల తెగకు చెందిన వీరభద్రుడిని, పోకనాటి మాలల చేత హత్య చేయించడం గమనిస్తే ఆయా కులాల్లోని అంతర్గత వైరుధ్యాల్ని అగ్రకులాలు ఏవిధంగా ఉపయోగించు కుంటాయో తెలుస్తుంది. ముఖ్యంగా పీడితకులాల్లోని అంతర్గత వైరుధ్యాల్ని తమ స్వప్రయోజనాలకు అనుగుణంగా రెచ్చగొట్టడమనే పద్ధతి ఈనాటికీ కొనసాగడం వర్తమాన సామాజిక, రాజకీయ పరిస్థితుల్ని గమనించినవారికి తేటతెల్లంగా కనిపిస్తోంది. అందుకే 'స్మశానం దున్నేరు' నవల కేవలం ఒక కథ మాత్రమే కాదు. ఒకనాటి జీవితాన్ని రికార్డు చేసిన నవల మాత్రమే కాదు, దానికి సామాజిక పరమైన ప్రాసంగికత వుంది.

హరిజన వాడలో అణచివేతకు గురయ్యే కులాల వారిలోని అంతర్గత వైరుధ్యాల్ని చాలా సున్నితంగా, ప్రతిభావంతంగా చూపడంలో



రచయిత సఫలమయ్యారు. ఈ వైరుధ్యాల్ని రెచ్చగొడుతూ, తమ పీడన కింద అణగారిపోయే హరిజనులు ఏకం కాకుండా ఉండేందుకు ఎన్నిరకాలుగా ప్రయత్నించేవారో ఈ నవల చెబుతుంది.

నవల ఆరంభంలోనే ఈ వైరుధ్యాల ప్రస్తావన ఉండటం గమనార్హం: "హరిజనవాడ వాడలోని ముప్ఫై కుటుంబాలు 'పోకనాటి' తెగవి. వీరభద్రుని కుటుంబం ఒక్కటి మాత్రం 'రంపాల' తెగకు చెందింది."

ఈ రెండు తెగలు మాల కులానికి చెందినవి. తెగలు వేరయినా వారు పడే కష్టాలు ఒకటే. వారి మీద జరిగే అణచివేత ఒకటే. బీభత్సపూరితమైన పీడన కింద రెండు తెగలవారు అణగారిపోతూనే వుంటారు. అయినప్పటికీ తలవంచుకు బతికే నైజం పోకనాటి తెగల్లో వుంటే ప్రశ్నించే తత్వం రంపాల తెగలో వుంటుంది. దీన్ని చిత్రించడంలో రచయిత పరిశీలనాశక్తి ఎంతటి తీవ్రమైనదో, సునిశితమైనదో తెలుస్తుంది. హరిజనుల జీవితాన్ని చాలా సన్నిహితంగా గమనించడం వల్లనే ఇది సాధ్యమైంది. కేవలం హరిజనుల జీవితమే కాదు, మొత్తంగా గ్రామీణ జీవితంలోని బహుళ పార్శ్వాలతో ప్రగాఢమైన పరిచయం ఉంటే తప్ప ఇలాంటి రచన సాధ్యం కాదు. మూడు దశాబ్దాల కిందటనే ఈ రచయిత దృక్పథం, పరిశీలనాశక్తి, ఆసక్తి, అనుభవ విస్తృతిలోని గాఢత, సాంద్రతని అర్థం చేసుకోవడానికి ఈ నవల ఉపకరిస్తుంది.

ఎవరి అనుభవాలు వాళ్ళు మాత్రమే రాయాలనే నినాదం వచ్చి బలపడిన ఆధునికానంతర కాలంలో కేశవరెడ్డి రాసిన ఈ నవలని, ఇందులోని ఇతివృత్తాన్ని ఎలా చూడాలి, ఎలా అర్థం చేసుకోవాలనే ప్రశ్నలకు కూడా జవాబులు చెప్పుకోవాలి.

ఎవరి అనుభవాలు వాళ్ళు రాసుకోవాలనే మాటతో పేచీలేదు. వాళ్ళే బలంగా రాయగలరన్న మాటతో కూడా విభేదం లేదు. కానీ అనుభవం వేరు, సమస్య వేరు. ఈ రెండూ వేర్వేరు అంశాలు. చలం ఆడదానిగా పుట్టకున్నా ఆడవాళ్ళ సమస్యల్ని దగ్గరగా చూసి, సహానుభూతితో రచనలు చేశాడు. వారి బాధాతీవ్రతని అర్థం చేసుకోవడంలో సఫలీకృతమైనందునే బలమైన రచనలు చలం నుంచి వచ్చాయి. అదేవిధంగా కేశవరెడ్డి రాస్తున్న నవలల్ని, వాటిలోని ఇతివృత్తాన్ని చూడాలి.

దళితులు కానివారికి దళిత జీవితానుభవం ఉండదు. సాంస్కృతికపరమైన జీవితానుభవం సిద్ధించదు. కానీ దళిత సమస్యలు, దళితులపై అవగాహన ఉండడానికి దళితులే కానక్కర్లేదు. పరిశీలనాశక్తి, ఆసక్తి, ఆర్తి వుంటే దళితుల సమస్యలు, వారు ఎదుర్కొనే రకరకాల పీడనల గురించి సంపూర్తిగా తెలుస్తుంది. అవగాహన ఏర్పడుతుంది. స్పందించే సున్నిత మనస్తత్వం వున్నవారిని మరింత తీవ్రంగా ఆలోచింపజేసే అవకాశం వుంది. కనుకనే మూడు దశాబ్దాల కిందట కేశవరెడ్డి ఎంతో మథనపడి రాసిన నవల ఇది. చిత్తూరు జిల్లాలో జన్మించిన ఈ రచయిత పాండిచ్చేరిలో మెడిసిన్ చేశారు. పరాయికరణకు లోను కాలేదు. గ్రామీణ జీవితంతోటి, అక్కడి మూలాలతోటి నిత్యసంబంధం వుంది ఈ రచయితకి. అందుకే కేశవరెడ్డి మానసిక ప్రపంచంలో గ్రామం కేంద్రీకృతమైంది. ఆ గ్రామంలో పీడితులయిన వారి పక్షాన వారి ఆలోచనలు నిలిచి వున్నాయి. అదే సమయాన రచయితగా నవల రాసే క్రమాన కళాసూత్రాల్ని విస్మరించలేదు. కేవలం ఎంచుకున్న వస్తువుపై



సాధికారికత వుండడంతోనే సరిపోదు, దానిని కళాత్మకంగా మలచినప్పుడే పాఠకులు స్వీకరిస్తారు. ఆ నవల, నవలలోని పాత్రలు మిశ్రమ అనుభూతులకు, స్పందనలకు లోను చేస్తాయి. ఈ కళాసూత్రాల మర్మమెరిగిన రచయిత కాబట్టి భూస్వామ్య పీడన కింద అణగారిపోతూ దుర్భరపరిస్థితుల్లో వున్న హరిజనుల జీవితాన్ని చాలా వాస్తవికంగా, ఆర్ద్రంగా రాశారు. రియలిజం శిల్పపరిధిలో సాగిపోయిన నవల ఇది. నవల ముగింపులో మాత్రమే ఒక ఇంద్రజాలం కనిపిస్తుంది. ఇది వాస్తవానికీ, పాఠకుల మనోవాంఛితానికీ దగ్గరగా వుండే ముగింపు. ఎక్కడో చోట న్యాయం జరగాలి. ఆ న్యాయం ప్రకృతి సూత్రాలకో, ఆధ్యాత్మిక సూత్రాలకో కట్టుబడి వుండటం ఆక్షేపణీయం కాదు. పాత్రల చైతన్యస్థాయికి మించిన చర్యలతో కూడిన ముగింపు రచయిత ఇవ్వడం సముచితం కాదు. మరి మార్గాంతరం ఏమిటనే ప్రశ్న వస్తుంది. కనుకనే పెద్దరెడ్డి కారణంగా జైలు పాలయినవారు దేవాలయంలోని శూలాలతో అతడిని, అతని మందీ మార్బలాన్ని మూకుమ్మడిగా హత్య చేయడమనే దృశ్యం అసాధారణ మేమి కాదు. ఆ నవలకు అవసరమైన ముగింపు అది. ఆకస్మికమైన చైతన్యం, పోరాటాలు ఎగసిపడే అవకాశాలు లేనప్పుడు ఇలాంటి ముగింపును ఇవ్వడం ద్వారా పీడనకు ఏదో రూపంలో ముగింపు ఉంటుందని రచయిత సూచిస్తున్నట్టుగా తెలుస్తుంది.

ఈ నవలని, రచయిత బహుశా ఎమర్జన్సీ తర్వాత రాసి వుంటారు. ఆ కాలానికి తెలుగునాట పోరాటాల వెల్లువ అంతగా లేదు. దళిత, దళిత చైతన్యం అనే పదాలకు చోటు లేదు మన సాహిత్యంలో. నవలలో హరిజనులు అనే మాట వాడటానికి ఇదే ప్రధాన కారణం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ ఎనభైల దాకా

మన దేశంలో, రాష్ట్రంలో భూస్వామ్యశక్తులు బలంగా వున్నాయి. దోపిడీ దౌర్జన్యాలకు అంతులేదు. హరిజనుల్ని మనుషులుగా చూసేవారు కాదు. తమకు సేవ చేయడానికే వారు పుట్టారని భావించిన పరిస్థితులున్నాయి. అగ్రకులాల వారే కాదు వెనుకబడిన కులాలు వారు సైతం దళితుల్ని హీనంగా చూశారు. వారిని మనుషులుగా పరిగణించ లేదు. బిసిలకీ, దళితులకీ సామాజిక చైతన్యం పెంపొందింది 1985 తర్వాతనే. అప్పటివరకు హరిజనుల జీవితం ఎంతో దుర్భరంగా వుంది.

దళిత సమస్యని కేశవరెడ్డి సంపూర్ణంగా అర్థం చేసుకున్నారు. దళితుల సాంస్కృతిక జీవితం గురించి రాయాలంటే దళితులయి వుండాలి, కానీ దళిత సమస్యని చిత్రించడానికి దళితులయి ఉండక్కర్లేదు. దళితులు ఎదుర్కొంటున్న పీడన గురించి చెప్పడానికి దళిత కులాల్లో పుట్టనక్కర్లేదు. దళిత సమస్యల పట్ల సరైన అవగాహన వుండాలి. ఆర్ధ్రంగా స్పందించే చైతన్యం అవసరం. ఈ రకమైన హృదయ సంస్కారం గల రచయిత కాబట్టే కేశవరెడ్డి ఈ నవలలో హరిజనుల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకున్నారు. కథాకథనంలోగానీ, వర్ణనల్లో గానీ ఎక్కడా దళితుల పట్ల వ్యతిరేకత లేదు. చిన్నచూపు లేదు.

ఈ దోపిడీ పీడనలకు గల మూలాల్ని అర్థం చేసుకున్నారు రచయిత. దళితులకు, వెనుకబడిన కులాలకు మధ్యన గల వైరుధ్యాలు, దళితకులాల్లోని అంతర్గత వైరుధ్యాలు ఆకళింపు చేసుకున్నారు. ఈ వైరుధ్యాల్ని ఆసరాగా చేసుకొని దోపిడీ దౌర్జన్యాలు సాగించే భూస్వాముల తీరును రచయిత చిత్రించారు. ఈ వైరుధ్యాలు సమసిపోవాల్సిన అవసరాన్ని బైరాగి వ్యాసదేవ పాత్ర ద్వారా సూచిస్తాడు



రచయిత. నవల చివర్లో భూస్వామి పెదరెడ్డిని హతమార్చడంలో బిసి కులానికి చెందిన వెంకటాద్రి, ముప్ఫయి మంది హరిజనులు ఏకం కావడం గమనిస్తే, పీడిత కులాల మధ్య ఐక్యత అవసరాన్ని రచయిత ప్రతీకాత్మకంగా చెప్పారనిపిస్తుంది.

అస్తిత్వ ఉద్యమాలు ఆత్మగౌరవం, ఉనికి వంటి అంశాల్ని బలంగా ముందుకు తెచ్చాయి. కానీ పీడితకులాల్లోని అంతర్గత వైరుధ్యాలు మరింత పెచ్చరిల్లి శత్రువైరుధ్యాలుగా మారిపోయే పరిస్థితులు ఏర్పడటం గమనార్హం. నవల చదువుతుంటే ఇవాళ మాల, మాదిగల మధ్యన వున్న వైరుధ్యాలు గుర్తుకువస్తాయి. ఈ రెండు కులాల మధ్య వున్న వైరుధ్యాలు, శత్రువైరుధ్యాలుగా మారిపోయిన వైనం స్ఫురణకు వస్తుంది. అందుకే ఈ నవలలో ఒకే కులానికి చెందిన హరిజనుల మధ్యన జరిగిన ఘర్షణలు, తీవ్రమైన వైరుధ్యాల చిత్రణ అసహజంగా తోచలేదు. గ్రామీణ వ్యవస్థలోని వెనుకబాటుతనం, తెలిసీతెలియని వైనం, భూస్వాముల కుటిల వ్యూహాలు అంతుబట్టని హరిజనుల మధ్యన ఆ వైరుధ్యాలు ఉండటం సాధారణమే. కానీ ఇవాళ కూడా ఆ వైరుధ్యాల్ని పరిష్కరించుకోలేని దశలో దళిత ఉద్యమాలు ఎందుకున్నాయన్నది అసలైన ప్రశ్న.

మూడు దశాబ్దాల కిందట రాసిన ఈ నవలలో చదివించే శైలి ప్రధానాకర్షణ. స్థలాలనీ, సంఘటనలనీ, సన్నివేశాలనీ దృశ్యమానం చేయడంలో రచయిత చూపిన ప్రతిభ అబ్బురపరుస్తుంది. సంభాషణల్లో స్థానిక మాండలికం, రచయిత కథనంలో వ్యవహారికమైన భాష కలగలిసిపోయి రచనకు నిండుదనాన్ని ఇచ్చాయి. ఈ నవలలోని వ్యాసదేవ పాత్ర, తర్వాత వచ్చిన నవలల్లోని బైరాగి పాత్రలని

స్ఫురింపజేస్తుంది. ఇది కేశవరెడ్డి నవలాశిల్పంలోని ఒక ప్రత్యేకత. రచయిత దేనినీ వాచ్యం చేయకుండా ఉండేందుకు అనుసరించిన పద్ధతి. తను చెప్పదలుచుకున్న అంశాన్ని ఈ పాత్ర ద్వారా సూచించారు రచయిత. ప్రకృతిని, ప్రకృతిలోని వాతావరణాన్ని వాస్తవికంగా, హృద్యంగా కథనంలో భాగంగా చెప్పడం వల్ల రచనకు చదివించే శక్తి లభించింది. కేశవరెడ్డి ఇతర రచనల మాదిరిగానే ఈ రచన వేగంగా చదివించింది. ఏం చెప్పాలన్నదే గాక ఎలా చెబితే పాఠకుణ్ణి నవలలో సంలీనం చేయవచ్చునో తెలిసిన రచయిత కేశవరెడ్డి. అందుకు తగ్గట్టుగానే తన రచనాసామాగ్రిని రూపొందించుకునే స్వభావం తొలినుంచి రచయితకు ఉందని చెప్పిన నవల 'స్మశానం దున్నేరు'. వైరుధ్యాల చిత్రణ ఈ నవలలో ప్రధానం. తద్వారా వాటిని పరిష్కరించుకోవాల్సిన అవసరాన్ని రచయిత గుర్తు చేశారు. కానీ ఈనాటికి పీడిత కులాల మధ్యన ఉన్న వైరుధ్యాలు మరింతగా పెరిగి, శత్రువైరుధ్యాలుగా మారడం ఓ విషాదకర స్థితి. ఈ నవలలో తమ బతుకులని తమకు కాకుండా చేసిన పెదరెడ్డిని, అతని పరివారాన్ని సమూలంగా నిర్మూలించేందుకు వెనుకబడిన కులాలకు చెందిన వెంకటాద్రి, హరిజనులు ఏకమవుతారు. మరి ఈ రాష్ట్రంలో తమ మధ్యన చిచ్చుపెట్టి, తమలో తమకు శత్రుత్వాన్ని రాజేసిన అగ్రకుల పెత్తందారీ మూకలకు వ్యతిరేకంగా విభిన్న దళిత కులాలవారు, వెనుకబడిన కులాలవారు ఏకమయ్యేదెప్పుడు అనే ప్రశ్న కలుగుతుంది ఇప్పుడు ఈ నవల చదివితే.

దళితవాదం లేని కాలంలోనే దళిత సమస్యని ఇతివృత్తంగా చేసుకొని అణచివేతకు లోనయ్యే కులాల్లోని అంతర్గత వైరుధ్యాలని



చర్చకు పెట్టారు రచయిత కేశవరెడ్డి. ఇది ప్రధానంగా గుర్తించాల్సిన అంశం. తద్వారా రచయిత ముందుచూపు, ఆలోచనా విస్తృతి, దృక్పథం, సహృదయత ఏమిటో తెలుస్తుంది. కనుకనే అణచివేతకు లోనయ్యే కులాలవారు ఈ నవలని చదివి, చర్చించాల్సిన అవసరం వుంది.

**-గుడిపాటి**

# " షాక్ ట్రీట్ మెంట్"

కొన్ని మంచి నవలలు – తాపీగా చదివించి మనల్ని ఆలోచింపసేస్తాయి. మరికొన్ని మనసును చిందరవందర చేసి, మనకు 'షాక్ ట్రీట్ మెంట్' యిచ్చిన అనుభూతి కలుగజేస్తాయి. 'స్మశానం దున్నేరు' సరిగ్గా యిటు వంటి నవలే !

కులాల్లో ఎన్నో రకాలు వున్నాయిట. కొన్నిటిని పై తరగతి కులాలంటారు. మరి కొన్నిటిని కింది తరగతి కులాలంటారు. కాని కింద తరగతిగా చెప్పబడేవాళ్ళు, తమ వారిలోనే కొందరిని తమకంటే 'తక్కువ' వాళ్ళుగా, ఈసడింపుగా చూస్తారు. అలాంటి ఒక 'తక్కువ' మనిషి వీరభద్రుడు. ఇటువంటి వీరభద్రులే – వారానికి దాదాపు నాలుగు సార్లయినా – మన దేశంలో ఎక్కడో ఒకచోట – ఏదో రకమైన 'చావు'తో పత్రికల వార్తల్లో కనిపిస్తూ వుంటారు.

మన దేశంలో పేదవారికి న్యాయం లభిస్తుందా? చట్టాలు ఏం చేస్తున్నాయి? ప్రభుత్వాధికారులు దుర్మార్గులను అణగ ద్రొక్కి, సన్మార్గులకు న్యాయం కలిగిస్తున్నారా? ప్రభుత్వాలు వున్నది ఎందుకు? ప్రజలను రక్షించడానికా? భక్షించడానికా?..... ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు – ఈ నవల చదివిన తర్వాత మనల్ని కలచివేస్తాయి.

"నిన్ను కొట్టినోడు నీ పైన కాంటు (పగ) పెట్టుకోనుండి కొట్టలేదు. సావకార్లను సంతోష పెట్టేదానికి కొట్టుంటారు. నాకు తెల్సు....పై వాళ్ళను మెప్పించేదానికి పోలీసోల్లు అన్నెం పున్నెం తెలవనోళ్ళను తీసుకపోయి, తుపాకుల్తో కాల్చి సంపతా ఉంట్లేదా? అట్టనే."



"పోలీసోళ్ళు గూడా అంతేనంటావా?"

"పోలీసోల్లూ అంతే... వొకీల్లూ అంతే. అందరూ అంతే."

ఇద్దరు దగాపడిన తమ్ముళ్ళ మధ్య సాగిన సంభాషణ యిది. ఉన్నవాడు, లేనివాడి శ్రమ శక్తిని దోచుకోవడమే కథావస్తువు. ఈ నవలలో ప్రతి పాత్ర, ఆ పాత్ర ప్రతి కదలికా, సజీవంగా కనిపిస్తుంది.

దోపిడి వర్గం అభివృద్ధికి కొమ్ముకాసే వెంకటాద్రివంటి మధ్య తరగతి వ్యక్తులు యెలాంటి పరిణామాన్ని యెదుర్కోవలసి వస్తుందో, తమకు జరిగిన ఘోరాలకు– ప్రతీకారం తీర్చుకోవాలని అనుకున్నప్పుడు సంఘటిత శ్రామికశక్తి ఏ విధంగా విజృంభిస్తుందో అద్భుతంగా చిత్రీకరించిన నవల యిది. శ్రమ జీవులకు వాళ్ళ హక్కులు, బాధ్యతలు గురించి 'ఎడ్యుకేట్' చేస్తూ, వారిని క్రమశిక్షణాయుతమైన విప్లవపథం వైపు నడిపించే – 'రాజకీయ నాయకత్వం' లేనప్పుడు – ఎలాంటి తీవ్రమైన పరిణామాలు ఏర్పడతాయో పరోక్షంగా నిరూపిస్తున్నది ఈ నవల.

**ఆంధ్రజ్యోతి మాసపత్రిక, ఏప్రిల్ 1980**

---

(1980లో విశాలాంధ్ర నిర్వహించిన పోటీలలో ద్వితీయ ఉత్తమ నవలగా బహుమతి పొందినదీ 'స్మశానం దున్నేరు!' ఈ సందర్భంగా 1980 ఏప్రిల్‌లో జ్యోతి మాసపత్రిక ప్రచురించిన సమీక్ష ఇది.)

# 1

చంద్రుడు పడమటి ఆకాశాన నిలిచి వెన్నెలను కుమ్మరిస్తున్నాడు.

ముప్పై ఒక్క కుటుంబాలు కలిగిన హరిజనవాడ, దాని నానుకొని ఉన్న తారురోడ్డు, రోడ్డుకవతల ఉన్న అగ్రహారం వెన్నెలలో తడుస్తూ నిద్రలో తేలుతున్నాయి.

హరిజన వాడలోని ముప్పై కుటుంబాలు 'పోకనాటి' తెగవి. వీరభద్రుని కుటుంబం ఒక్కటిమాత్రం 'రంపాల' తెగకు చెందింది.

తొలికోడి కూసింది.

మోచేతిని తలగడగా చేసుకొని జొల్లు కారుస్తూ నిద్రిస్తుండిన వీరభద్రుడు మేలుకొని కళ్ళు తెరిచాడు.

కోళ్ళు ఒకదాని వెంబడి ఒకటిగా ఎడతెగకుండా కూస్తున్నాయి. వీరభద్రుడు లేచి ఆవులించాడు. వొళ్ళు విరుచుకొని గోడనానుకొని కూర్చున్నాడు.

పొయ్యి ముందు పడుకొని వున్న అతని భార్య, ఆమె కిరువైపుల పడుకొని వున్న ఇద్దరు కూతుళ్లూ అప్పటికే మేలుకొని కళ్ళు తెరచుకొని, అతని వైపే చూస్తున్నారు.

"ఎప్పుడూలేదు పాడు సలి. యిట్టా ఎప్పుడూ లేదు" వీరభద్రుడు చలికి పళ్ళు టకటక లాడిస్తూ అన్నాడు.

అతని భార్య రాజి లేచి కూర్చుని చిరుగుల దుప్పటిని జాగ్రత్తగా కప్పుకుంటూ, "పండగ నెల మొదలయింది గదా." అంది.

"మొదలయిదంటే అట్టా యిట్టానా. ఈ నెల ముగిసేలోగా భూమ్మీదుండే ముసిలీ ముతకా రాలిపోయేట్టుండారు," అన్నాడు వీరభద్రుడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=740**

*** * ***

**Read other books of Dr. Kesava Reddy @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=238**